

సోమశిలలో 42.742 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో శుక్రవారం 42.742 టీఎంసీల నీరుంది. పెన్నార్ డెల్టాకు 3,030, ఉత్తర దక్షిణ కాలువలకు 300 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.98,140
22 క్యారెట్ల ఆర్నమెంట్ (గ్రా)	రూ.8,920
3 శాతం జీఎస్టీతో	రూ.9,188
నవర (8 గ్రా)	రూ.73,504

గరిష్టం/కనిష్టం 35.3 /26.2

వాతావరణం

జిల్లాలోని వాతావరణం శనివారం సాధారణంగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ శుక్రవారం 100 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

కాకాణి బెయిల్ పిటిషన్ 2కు వాయిదా

నెల్లూరు (లీగల్): మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై పొదలకూరు పోలీసులు నమోదు చేసిన అక్రమ కేసులపై 5వ అదనపు జిల్లా (ప్రత్యేక ఎస్సీ, ఎస్టీ) కోర్టులో బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. శుక్రవారం గోవర్ధన్‌రెడ్డి తరఫు న్యాయవాది రామిరెడ్డి రోజారెడ్డి ఏపీపీకి నోటీసులు ఇచ్చిన అనంతరం బెయిల్ పిటిషన్ కోర్టులో దాఖలు చేశారు. ఈ కేసు విచారణ జూన్ 2వ తేదీ సోమవారానికి వాయిదా వేశారు. ఇదే కేసులో పోలీసులు గోవర్ధన్‌రెడ్డిని పోలీసు కస్టడీకి కోరుతూ వేసిన పిటిషన్ విచారణ కూడా సోమవారం విచారణకు రానుంది.

చౌకదుకాణాల్లోనే రేషన్

నెల్లూరురూరల్: జూన్ 1వ తేదీ నుంచి తెల్లరేషన్ కార్డుదారులకు దుకాణాల వద్ద బియ్యం పంపిణీ చేస్తారని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎండీయూ వాహనాలను ప్రభుత్వం రద్దు చేసిన నేపథ్యంలో ఇకపై రేషన్ దుకాణాల ద్వారా మాత్రమే పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు గమనించి రేషన్ దుకాణాల వద్దకు వెళ్లి రేషన్ బియ్యం పొందాలని కోరారు. 65 ఏళ్ల పైబడిన కార్డుదారులు, దివ్యాంగులకు ప్రతి నెల 1 నుంచి 5వ తేదీ వరకు వారి ఇంటి వద్దనే అందించడం జరుగుతుందన్నారు.

నేడు కాకాణితో సజ్జల ములాఖత్

వెంకటాచలం: కూటమి ప్రభుత్వం పెట్టిన అక్రమ కేసుతో జిల్లా జైల్లో ఉన్న మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నేత సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం ములాఖత్ ద్వారా పరామర్శిస్తారని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆయన జైలు వద్దకు చేరుకుంటారని, మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు జైలు వద్దకు తరలిరావాలని కోరారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల్లో త్రిముఖ పోటీ

నెల్లూరు (లీగల్): నెల్లూరు బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికల ప్రక్రియలో నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం శుక్రవారం ముగిసింది. ఈ ఎన్నికల్లో మూడు ప్యానల్స్ అభ్యర్థులు పోటీ పడుతున్నారు. వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి ప్యానల్ నుంచి అధ్యక్షుడిగా పులిమి అయ్యప్పరెడ్డి, ఉపాధ్యక్షుడిగా ఈదూరు భాస్కరయ్య జనరల్ సెక్రటరీగా నక్కల నాగరాజు జాయింట్ సెక్రటరీగా కె. లక్ష్మీనారాయణ, కోశాధికారిగా ఆర్. శివశంకర్ రావుతోపాటు మరో 11 మంది కార్యవర్గ పదవులకు పోటీలో నిలిచారు. న్యాయవాదుల ఐక్యవేదిక ప్యానల్ నుంచి అధ్యక్షుడిగా వేళ్ల ఉపేంద్రరావు, ఉపాధ్యక్షుడిగా జల్లి పద్మాకర్, జనరల్ సెక్రటరీగా సత్తు అంకయ్య, జాయింట్ సెక్రటరీగా నాగేళ్ల రవికృష్ణ, కోశాధికారిగా డి.పెంచలప్రజీత్ రెడ్డితోపాటు మరో 11 మంది కార్యవర్గ పదవులకు బరిలో ఉన్నారు. జాతీయ న్యాయవాద వేదిక ప్యానల్ నుంచి అధ్యక్షుడిగా దాసరి రాజేంద్రప్రసాద్, ఉపాధ్యక్షుడిగా బీఎస్ రంగారాజన్, జనరల్ సెక్రటరీగా సీహెచ్ నవీన్‌రెడ్డి, జాయింట్ సెక్రటరీగా తాండ్ర బాబురెడ్డి, కోశాధికారిగా పీజీ మహేష్‌తోపాటు మరో 11 మంది కార్యవర్గ పదవులకు పోటీలో ఉన్నారు. జాయింట్ సెక్రటరీ ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఒమ్మిన ఈశ్వర్‌మనోజ్ కుమార్ పోటీ పడుతున్నాడు.

వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కమిటీలో పదవులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు నెల్లూరు జిల్లాకు చెందిన పలువురిని రాష్ట్ర అనుబంధ విభాగాల కమిటీల్లో శుక్రవారం నియమించారు. స్టేట్‌యూత్ వింగ్ జనరల్ సెక్రటరీగా కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి (సర్వేపల్లి), స్టేట్ యూత్ వింగ్ అఫీషియల్ స్పోక్స్ పర్సన్‌గా చీదెళ్ల కిషన్ (నెల్లూరుసిటీ), స్టేట్ యూత్ వింగ్ సెక్రటరీలుగా కోడూరు సునీల్‌రెడ్డి (గూడూరు), పాశం శ్రీనివాసులు (నెల్లూరు రూరల్), జాయింట్ సెక్రటరీలుగా కడివేటి అన్వేష్‌కుమార్‌రెడ్డి (కోవూరు), తోట మల్లికార్జున (కందుకూరు), వేనాటి సుమంత్‌రెడ్డి(సూళ్లూరుపేట), రాష్ట్ర మహిళా విభాగం జోనల్ ప్రెసిడెంట్‌గా మొయిళ్ల గౌరిరెడ్డి (నెల్లూరురూరల్)ని నియమిస్తూ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది.

నాడు



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలకు పెద్దపీట వేశారు. కేజీ నుంచి పీజీ వరకు ప్రగతిశీల విద్యకు శ్రీకారం చుట్టారు. దుర్వావస్థలో ఉన్న ప్రభుత్వ బడులను నాడు-నేడు పథకం ద్వారా రూపురేఖలు మార్చి అభివృద్ధి చేశారు. మెరుగైన వసతులు, నాణ్యమైన మెనూను అందించారు. తెలుగుతోపాటు ఇంగ్లిష్ మీడియం విద్యను అందుబాటులోకి తెచ్చారు. సీబీఎస్‌ఈ, ఐబీ, టోఫెల్ సిలబస్‌లను అందించారు. నాణ్యమైన డిజిటల్ విద్యను అందించేందుకు 8వ తరగతి నుంచి విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీతోపాటు స్కూళ్లల్లో బోధనకు స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసి కార్పొరేట్ కన్ను కుట్టేలా ప్రభుత్వ విద్య వ్యవస్థను మార్చేశారు.

నేడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సర్కారు బడులను గాలికి వదిలేశారు. ఏడాది కాలంలోనే విద్యా వ్యవస్థను విధ్వంసం చేశారు. గత ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తీసుకువచ్చిన సీబీఎస్‌ఈ, ఐబీ, టోఫెల్ అధునాతన విద్యకు మంగళం పలికింది. డిజిటల్ విద్యను అటకెక్కించింది. కార్పొరేట్ విద్యకు ప్రోత్సహిస్తూ సర్కారు పాఠశాలల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపును సర్వనాశం చేస్తోంది. పాఠశాలల్లో గత ప్రభుత్వం అభివృద్ధి చేసిన వసతుల పునరుద్ధరణతోపాటు పర్యవేక్షణను విస్మరించింది. అసంపూర్తిగా ఉన్న అదనపు తరగతి గదులు నిర్మాణాల ఊసే లేదు. విద్యార్థులకు పెట్టే నాణ్యమైన మెనూకు కోతలు పడ్డాయి. ప్రభుత్వ విద్య వినాశనానికి విశ్వసంకల్పంబూనింది.



సర్కారు విద్య సర్వనాశనం

కూటమి పాలనలో కునారిల్లుతున్న స్కూళ్లు

- తల్లికి వందనం.. పంగనామం
- నాడు–నేడు పథకానికి 'నారా'గ్రహణం
- డిజిటల్ విద్యకు మంగళం
- నాసిరకంగా మారిన మధ్యాహ్న భోజనం

నెల్లూరు (టౌన్): వందేళ్ల తలకిందులుగా తపస్సు చేసినా సర్కారు విద్యలో దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం సాధించలేని ప్రగతిని.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తొలి ఏడాది నుంచే యజ్ఞంలా శ్రమించి సాధించింది. ప్రపంచ స్థాయి సిలబస్‌లు సీబీఎస్‌ఈ, ఐబీ, టోఫెల్‌తో కేంద్రియ విద్యా సంస్థలను మించి దీటుగా సర్కారు విద్యావ్యవస్థకు శ్రీకారం చుట్టారు. గొప్ప సంస్కరణలతో బుడిబుడి అడుగుల్లోనే అంతర్జాతీయ స్థాయి వేదికల్లో సర్కారు విద్యార్థుల ప్రతిభను చాటే స్థాయికి తీసుకెళ్లారు. మరో ఐదేళ్లలో దేశంలోనే అగ్ర రాష్ట్రంగా ఖ్యాతిని గడించేది. అడ్డదారిలో అధికారాన్ని చేజిక్కించుకున్న కూటమి ప్రభుత్వం ఒక్క ఏడాదిలో సర్కారు విద్యను కుప్ప కూల్చేసింది. గత ప్రభుత్వం పాఠశాలల రూపురేఖలు మార్చేందుకు చేపట్టిన నాడు–నేడు పథకానికి గ్రహణం పట్టించారు. విద్యార్థులను ప్రభుత్వ బడులకు ఆకర్షించేందుకు ఇస్తున్న అమ్మ ఒడి పథకానికి పంగనామాలు పెట్టారు. విద్యార్థులకు అందించే విద్యాకానుక, గోరుముద్ద నాణ్యతకు తిలోదకాలిచ్చారు. డిజిటల్ విద్యలో భాగంగా అందించిన ట్యాబ్‌లు పంపిణీని అటకెక్కించారు. స్కూళ్లల్లో బోధనకు ఏర్పాటు చేసిన స్మార్ట్ టీవీలు, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ నిర్వహణను గాలికి వదిలేయడంతో దుమ్ము పట్టిపోతున్నాయి. అత్యాధునిక విద్య అయిన ఇంగ్లిష్ మీడియం, సీబీఎస్‌ఈ సిలబస్, ఐబీ, టోఫెల్ విద్యకు మంగళం పాడేశారు. ఇంగ్లిష్ మీడియం తదితర విధానాలతో ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ రకంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది.



మనుబోలు గమళ్లపాలెంలో అసంపూర్తిగా ఉన్న ప్రాథమిక పాఠశాల భవనం

రూ.698.54 కోట్లతో 2,410 బడులకు కొత్త రూపు

వైఎస్సార్‌సీపీ పాలనలో సర్కారు బడుల అభివృద్ధికి నాడు–నేడు పథకం ద్వారా రెండు విడతల్లో రూ. 698.54 కోట్లతో 2,410 పాఠశాలల్లో కార్పొరేట్ తరహా వసతులు మెరుగు పరిచి అభివృద్ధి చేసింది. ఈ నిధులతో ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు గదులు, బాలురు, బాలికలకు విడివిడిగా టాయ్‌లెట్లు, ప్రహరీలు, కుర్చీలు, బెంచీలు, లైట్లు, ఫ్యాన్లు, గ్రీన్‌చాక్ బోర్డులు, ఆర్వో ప్లాంట్లు, తదతర మౌలిక వసతులను ఏర్పాటు చేశారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు బడ్జెట్లు ప్రవేశ పెట్టినప్పటికీ పాఠశాలల అభివృద్ధి, వసతుల నిర్వహణకు రూపాయి కేటాయించిన పాపాన పోలేదు.



అమ్మఒడి పథకం

సంవత్సరం	విద్యార్థులు	నగదు (రూ.కోట్లలో)
2020	2,51,811	377.71
2021	4,07,272	610.90
2022	2,31,866	347.79
2023	2,26,205	339.30

4 లక్షల మంది తల్లుల ఎదురుచూపు



జిల్లాలో తల్లికి వందనం పథకానికి అర్హులైన సుమారు 4 లక్షలకు మందికిపైగా తల్లులు ఉన్నారు. ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రతి కుటుంబంలో ఎంత మంది పిల్లలు చదువుతుంటే అంత మంది పిల్లలకు ఒక్కొక్కరికి రూ.15 వేలు తల్లికి వందనం ఇస్తామని చెప్పింది. ఈ లెక్కన జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లల్లో చదివే విద్యార్థులు సుమారు 4.70 లక్షల మంది ఉన్నారు. వీరిలో ప్రభుత్వం విధించే అర్హతల ప్రకారం తగ్గించినా.. దాదాపు 4 లక్షల మంది పిల్లల తల్లులకు సుమారుగా రూ.610 కోట్లపైగా జమ చేయాల్సి ఉంది. గతేడాదికి ఎగనామం పెట్టిన ప్రభుత్వం ఈ ఏడాదైనా ఇస్తుందా? లేదా? అనేది సందిగ్ధంగానే ఉంది. జూన్‌లో తల్లికి వందనం పథకాన్ని అమలు చేస్తామని చెబుతున్న సీఎం చంద్రబాబు ఆ పథకానికి సంబంధించిన మార్గదర్శకాలు ఇంత వరకు విడుదలే చేయలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమ్మఒడి పేరుతో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో చదువుతూ అర్హులైన ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15 వేలు అందజేసింది. ఆ ప్రభుత్వం నాలుగేళ్లు నిర్విఘ్నంగా ఈ పథకాన్ని అమలు చేసింది.

నాడు–నేడు అభివృద్ధి	రెండు విడతల్లో ఎంపికైన పాఠశాలలు	విడుదల చేసిన నిధులు రూ.	ట్యాబ్‌ల పంపిణీ	స్మార్ట్ టీవీలు	ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్
	2,410	698.54 కోట్లు	36,261 మందికి	428	1,324

అటకెక్కిన డిజిటల్ బోధన

ప్రభుత్వ పాఠశాలల్లో గత ప్రభుత్వం డిజిటల్ విద్యను ప్రవేశ పెట్టింది. చివరి రెండేళ్లపాటు 8వ తరగతి చదువుతున్న విద్యార్థులకు 36,261 ట్యాబ్‌లు పంపిణీ చేసింది. బైజుస్ సంస్థతో ఒప్పందం చేసుకుని విద్యార్థులకు డిజిటల్ బోధన అందజేసింది. తొలి విడతలో ప్రభుత్వ పాఠశాలల్లో 428 స్మార్ట్ టీవీలు, 1,324 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్‌ను బిగించి డిజిటల్ విద్యతోపాటు ఇంగ్లిష్ మీడియం సీబీఎస్‌ఈ సిలబస్, ఐబీ, టోఫెల్ విధానాలను ప్రవేశ పెట్టి నాణ్యమైన విద్యను అందించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక వీటన్నింటికి మంగళం పాడారు.

నాడు రోజుకో వెరైటీ.. నేడు అన్నమే కరువు

గత ప్రభుత్వ హయాంలో గోరుముద్ద పేరుతో విద్యార్థులకు మధ్యాహ్న భోజనాన్ని అందించారు. గుడ్లు, చిక్కిలతోపాటు రోజుకో వెరైటీ భోజనం అందించారు. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక కాలం చెల్లిన గుడ్లు, చిక్కీలను పంపిణీ చేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భోజనం సైతం నాణ్యంగా లేదని విద్యార్థులు ఇంటి దగ్గర నుంచే తెచ్చుకుని తింటున్న పరిస్థితి ఉంది.

నాడు దీవెనలు.. నేడు శాపాలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): విద్యార్థులకు నాణ్యమైన విద్య.. రూ.కోట్ల ఆస్తితో సమానమని భావించిన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దేశంలోని మరే రాష్ట్రంలో చేపట్టని విధంగా విద్యావ్యవస్థ దశ, దిశ మార్చేశారు. విద్యార్థులను అన్ని విధాలుగా తీర్చిదిద్దేందుకు ప్రవేశపెట్టిన పథకాలు దేశంలోని ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలను ప్రభావితం చేశాయంటే అతిశయోక్తి కాదు. జగనన్న విద్యాదీవెన, వసతి దీవెనలను ప్రవేశ పెట్టి వారి భవిష్యత్‌ను తీర్చిదిద్దేందుకు ప్రతిష్టాత్మకంగా అమలు చేశారు. ఫీజులు కట్టలేని, సరైన వసతి లేని ఎందరో విద్యార్థులకు ఈ పథకాలు ఎంతో ఉపయోగపడ్డాయి. విద్య కోసం తల్లిదండ్రులు అప్పులు చేయాల్సిన పని లేకుండా చేసిన ఈ పథకాలను కూటమి ప్రభుత్వం నిర్వీర్యం చేసింది. విద్యకు దీవెనగా ఉన్న పథకాలు విద్యార్థుల పాలిట శాపంగా మారింది. వసతిగృహాల్లో ఉంటూ విద్యాలయాలకు చెల్లించాల్సిన ఫీజుల భారం విద్యార్థుల తల్లిదండ్రులపై పడింది. కూటమి ప్రభుత్వంలో ప్రభుత్వ వసతిగృహాల్లో మెనూ దగ్గర నుంచి విద్యార్థుల ఆలనాపాలనా పట్టించుకునే పరిస్థితి లేదు. చివరకు వార్డెన్లు ఫల సరుకుల దుకాణాల్లో అప్పులు పెట్టాల్సి వచ్చింది. ఈ అప్పులు విద్యా సంవత్సరం పూర్తి కావస్తున్నా తీరకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. కాస్మోటిక్ చార్జీలు సంగతి అసలు చెప్పనవసరం లేదు. నేరుగా వారి ఖాతాల్లో పడుతున్నాయని చెబుతున్నారే కానీ స్పష్టత లేదు.

గత ప్రభుత్వంలో నిధుల కేటాయింపు

ఎస్సీ విద్యార్థులకు జగనన్న వసతి, విద్యా దీవెన

స్కాలర్‌షిప్ టైప్	క్వార్టర్	అకడమిక్	విద్యార్థులు	నగదు జమ (రూ.ల్లో)
విద్యాదీవెన	4	2019-20	12,453	25,84,67,433
వసతి దీవెన	1	2019-20	11,745	11,42,32,500
విద్యాదీవెన	3	2020-21	13,104	20,86,20,584
వసతి దీవెన	1	2020-21	12,833	12,43,15,000
విద్యాదీవెన	4	2021-22	13,521	11,19,28,443
వసతి దీవెన	1	2021-22	13,313	9,13,13,100
విద్యాదీవెన	4	2022-23	35,976	28,90,68,888
వసతి దీవెన	1	2022-23	11,549	11,15,57,500
విద్యాదీవెన	1	2023-24	11,577	7,76,26,525
విద్యాదీవెన	1	2024-25	9,858	11,04,53,533

జగనన్న వసతిదీవెన (ఎస్టీ)

సంవత్సరం	విద్యార్థులు	నగదు (రూ.లక్షల్లో)
2019-20	1,645	159.30
2020-21	2,244	219.37
2021-22	1,815	175.55
2022-23	1,693	162.65

జగనన్న విద్యాదీవెన (ఎస్టీ)

సంవత్సరం	విద్యార్థులు	నగదు (రూ.లక్షల్లో)
2019-20	1,761	369.38
2020-21	2,306	392.32
2021-22	2,286	435.91
2022-23	1,709	386.11

జగనన్న విద్యాదీవెన : బీసీ

సంవత్సరం	విద్యార్థులు	నగదు (రూ.లక్షల్లో)
2019-20	19,595	7,480.70
2020-21	22,693	5,656.61
2021-22	20,813	5,374.82
2022-23	18,981	5,235.79
2023-24	17,930	1,382.40

జగనన్న వసతిదీవెన : బీసీ

సంవత్సరం	విద్యార్థులు	నగదు (రూ.లక్షల్లో)
2019-20	23,264	2,260.20
2020-21	22,950	2,236.72
2021-22	23,969	2,322.17
2022-23	18,736	1,825.02

జగనన్న విద్యాదీవెన: ఈబీసీ

సంవత్సరం	విద్యార్థులు	నగదు (రూ.లక్షల్లో)
2019-20	8,595	4,852.59
2020-21	9,512	3,168.66
2021-22	9,605	3,272.90
2022-23	8,656	2,938.56
2023-24	7,800	727.41

జగనన్న వసతి దీవెన : ఈబీసీ

సంవత్సరం	విద్యార్థులు	నగదు (రూ.లక్షల్లో)
2019-20	10,042	987.95
2020-21	9,475	932.80
2021-22	9,300	914.47
2022-23	8,521	840.35

జగనన్న వసతిదీవెన : కాపు

సంవత్సరం	విద్యార్థులు	నగదు (రూ.లక్షల్లో)
2019-20	3,253	318.97
2020-21	2,842	278.42
2021-22	2,916	281.97
2022-23	2,697	262.27

జగనన్న విద్యాదీవెన : కాపు

సంవత్సరం	విద్యార్థులు	నగదు (రూ.లక్షల్లో)
2019-20	2,684	1,869.41
2020-21	2,863	922.67
2021-22	2,725	807.52
2022-23	2,737	840.63
2023-24	2,699	228.69

తల్లికి వందనం నిలిపివేశారు



కూటమి ప్రభుత్వం వచ్చాక గతేడాది నుంచి తల్లికి వందనం పథకాన్ని నిలిపివేశారు. గత ప్రభుత్వంలో నాలుగేళ్లు వరుసగా ఇచ్చారు. విద్యార్థికి రూ.15 వేలు నగదు నేరుగా తల్లి అకౌంట్లలో పడేవి. ఆ డబ్బులతో మా పిల్లలను ప్రైవేట్ పాఠశాలల్లో ఎలాంటి ఇబ్బందుల లేకుండా చదివించుకున్నాం. పథకం ఇస్తామని చెప్పి పేదలను మోసం చేయడం తగదు.

– రాజశేఖర్‌యాదవ్, విద్యార్థి తండ్రి, నెల్లూరు

డిజిటల్ విద్య అందించాలి



ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డిజిటల్ విద్య అందించాలి. ఇంగ్లిష్ మీడియంలోనే బోధించాలి. గత ప్రభుత్వం నాడు–నేడుతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసింది. కూటమి ప్రభుత్వం వచ్చాక ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. పైగా డిజిటల్ విద్యను నిర్వీర్యం చేసే పనిలో ఉంది. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను కూడా నిలిపివేశారు. డిజిటల్ విద్యతో విద్యార్థుల భవిష్యత్ మారుతుంది.

– శ్రీనివాసులరెడ్డి, విద్యార్థి తండ్రి, నెల్లూరు

ఇద్దరికీ వస్తుందనుకున్నాం



నా ఇద్దరు పిల్లలకు తల్లికి వందనం వస్తుందని ఆశపడ్డాం. ఏడాది అయినా ఇవ్వలేదు. జగనన్న ప్రభుత్వంలో నాలుగేళ్లు అమ్మఒడి నా బ్యాంకు ఖాతాలోకి వచ్చింది. తల్లికి వందనం ఎప్పుడిస్తారో ప్రకటించలేదు. విద్యా ర్థుల భవిష్యత్ కోసం వెంటనే తల్లుల ఖాతాలో నగదు అందించాలి.

– మండే సింధూజ, రామాయపట్నం

తల్లికి వందనం ఎప్పుడో.. ?



నా కుమార్తె రెండో తరగతి చదువుతోంది. ఎన్నికల సమయంలో అమ్మఒడి వస్తుందని దరఖాస్తు చేశాను. కొత్త ప్రభుత్వం వచ్చిన వెంటనే వస్తుందని అనుకున్నాం. ఇంత వరకు అకౌంటు నంబర్ కానీ ఏమీ తీసుకో లేదు.

– పెల్లేటి నాగలక్ష్మి, రామాయపట్నం

నేడు సజ్జల రామకృష్ణారెడ్డి రాక

- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): వైఎస్సార్‌సీపీ పీఏసీ కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి శనివారం నెల్లూరుకు వచ్చి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబ సభ్యలను పరామర్శిస్తారని నెల్లూరు సిటీ నియోజకవర్గ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. కాకాణి నివాసంలో శుక్రవారం ఆయన కుమార్తె కాకాణి పూజితను పరామర్శించి న్యాయపరమైన అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా చంద్రశేఖరరెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కాకాణి వంటి వ్యక్తిపై అక్రమ కేసు పెట్టి వేధించడం ప్రజాస్వామ్యంలో ఎప్పుడూ చూడలేదన్నారు. ప్రతిపక్ష నేతల అరెస్ట్‌లు ఇలాగే కొనసాగితే తిరిగి వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వస్తే టీడీపీ నాయకులు ఒక్కరైనా బయట తిరగ గలరా అని ప్రశ్నించారు. అక్రమ కేసులను ప్రజల దృష్టికి తీసుకెళ్లి బలంగా పోరాడుతామన్నారు. అక్రమ కేసులకు బెదిరేది లేదని, కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ఎండగట్టారు. తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్ని ఇబ్బందులు వచ్చినా ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని మార్గదర్శకం చేశారని వివరించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ వేలూరు ఉమామహేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున, విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు అశ్రిత్‌రెడ్డి, 11వ డివిజన్ ఇన్‌చార్జి మహేష్‌యాదవ్, 42వ డివిజన్ అధ్యక్షుడు అబ్దుల్ మస్తాన్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు కిషన్, కొండయ్య, అశోక్, పెంచలయ్య, పెంచలబాబు, వెంకటేష్, సుమధర్, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



కాకాణి పూజితను పరామర్శించిన వైఎస్సార్‌సీపీ నాయకులు

అక్రమ కేసులతో పైశాచికం

- కూటమి డైవర్షన్ రాజకీయాలతో పబ్బం
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు నాగార్జున

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు గాలికొదిలేసి ప్రతిపక్ష పార్టీ నేతలపై తప్పుడు కేసులు బనాయిస్తూ పైశాచిక ఆనందం పొందుతుందని, డైవర్షన్ రాజకీయాలతో పబ్బం గడుపుకుంటుందని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు, కార్పొరేటర్ ఊటుకూరు నాగార్జున విమర్శించారు. పార్టీ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కూటమి దాష్టీకాలను నిరసిస్తూ నలుపు వస్త్రాలు ధరించి, చేతికి నల్ల వస్త్రాలను సంకెళ్లగా వేసుకుని మీడియా సమావేశంలో మాట్లాడారు. మాజీమంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిపై అక్రమ కేసు బనాయించి జైల్లో పెట్టి ఏదో ఘన కార్యం చేసినట్లు జబ్బలు చరుచుకుంటున్న కూటమి నేతలు సిగ్గుపడాలన్నారు. ఏడాదిగా చేసిన మోసాలను, అకృత్యాలపై నిలదీస్తున్న కాకాణిపై కక్ష పూరితంగా వ్యవహరించడం కంటే.. ఇంకేమి చేయలేదన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా మా నాయకుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన భరోసాతో కూటమి దాష్టీకాలను ఎదుర్కొంటామన్నారు. రేపటి రోజున మా ప్రభుత్వం వస్తే మీరు ఇబ్బంది పెట్టినట్లుగా మేము వ్యవహరిస్తే టీడీపీ నేతలు మీడియా ముందుకు వచ్చి చెప్పుకోవడం కాదు కదా కనీసం రోడ్ల మీదకు వచ్చి తిరగలేరన్నారు. న్యాయ వ్యవస్థపై తమకు నమ్మకం ఉందని, కాకాణి ఎలాంటి తప్పు చేయలేదని క్లీన్‌చిట్‌తో బయటకు వస్తారని ధీమా వ్యక్తం చేశారు. అరెస్ట్‌లతో వైఎస్సార్‌సీపీ నేతలు ఎవరు బయపడరని, మరింత ఉధృతంగా ప్రజల్లోకి వెళ్లి కూటమి విధానాలను ఎండగడుతారని తెలిపారు. వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నేత చీదెళ్ల కిషన్, సర్వేపల్లి ఐటీ వింగ్ అధ్యక్షుడు రావుల ఇంద్రసేనాగౌడ్, నాయకులు ఇంద్రసేనారెడ్డి, వెంకటేష్, మీరా, కిషోర్, మస్తాన్, దీప్, మనోజ సుమధర్, లోకేష్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకులు

జోరు వాన.. రోడ్లు జలమయం

నెల్లూరు నగరంలో శుక్రవారం సాయంత్రం జోరు వాన కురిసింది. దీంతో చాలా ప్రాంతాల్లో రోడ్లు జలమయమయ్యాయి. రాకపోకలు సాగించేందుకు వాహనదారులు తీవ్ర ఇక్కట్లు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, నెల్లూరు


సండే మార్కెట్‌లో ఇదీ పరిస్థితి


బట్వాడిపాలెం సెంటర్‌లో ఇలా..


కేవీఆర్ పెట్రోల్ బంకు సమీపంలో..


దట్టంగా కమ్ముకున్న మేఘాలు

క్లుప్తంగా

వేగవంతంగా యోగాంధ్ర రిజిస్ట్రేషన్లు

- ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్



నెల్లూరు రూరల్: యోగాంధ్ర రిజిస్ట్రేషన్లను వేగవంతం చేయాలని ఇన్‌చార్జి కలెక్టర్ కె.కార్తీక్ అధికారులను ఆదేశించారు. వివిధ అంశాలపై జిల్లా అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలతో శుక్రవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం తన చాంబర్‌లో సమీక్ష చేశారు. ఎక్కువ మంది రిజిస్టర్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో సుమారు 10 లక్షల మందిని రిజిస్టర్ చేయాలని లక్ష్యంగా నిర్ణయించామని, ఇప్పటి వరకు 4.5 లక్షల మంది నమోదయ్యారని తెలిపారు. పింఛన్ల పంపిణీ సమయంలో వారి కుటుంబ సభ్యుల్లో ఔత్సాహికులను రిజిస్టర్ చేయించాలన్నారు. జూన్ 2 నుంచి 7వ తేదీ వరకు జిల్లా స్థాయి యోగా కార్యక్రమం రెసిడెన్షియల్ అసోసియేషన్ థీమ్‌తో జరుగుతుందని, దానికి ఏర్పాట్లు చేయాలన్నారు. విద్యుత్ శాఖ, పారిశుద్ధ్యం తదితర వాటిపై సమీక్ష చేశారు.

భర్త ఇంటి ముందు భార్య నిరసన


నిరసన తెలుపుతున్న కల్యాణి

బుచ్చిరెడ్డిపాళెం రూరల్: భర్త ఇంటి ముందు భార్య రెండు రోజుల నుంచి నిరసన తెలుపుతున్న ఘటన శుక్రవారం వెలుగులోకి వచ్చింది. బాధితురాలు కల్యాణి కథనం మేరకు.. రేబాలకు చెందిన ప్రసన్నకుమార్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నాడు. గత సంవత్సరం జొన్నవాడలో కల్యాణిని రెండో వివాహం చేసుకున్నాడు. పెళ్లైన రెండోరోజు నుంచే వేధింపులకు గురిచేశాడని ఆమె వాపోయింది. ఎందుకిలా చేస్తున్నావని భర్తను అడిగితే తనకు వేరే మహిళతో సంబంధం ఉందని చెప్పాడు. దీంతో కల్యాణి పుట్టింటికి వెళ్లిపోయింది. అయినా ప్రసన్నకుమార్ ప్రవర్తనలో మార్పు రాలేదు. రెండురోజుల క్రితం రేబాలలోని భర్త ఇంటికి కల్యాణి వెళ్లగా లోనికి రానివ్వకుండా అడ్డుకున్నాడు. తనను విచక్షణారహితంగా కొట్టారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని, న్యాయం చేయాలని వేడుకుంటోంది.

కదల్లేడు.. సాయం చేయండి

- 30 సంవత్సరాలుగా స్టేడియంలో పనిచేస్తూ..
- సంవత్సరంగా జీతం లేదు
- కొద్దిరోజుల క్రితం బ్రెయిన్ స్ట్రోక్
- మంచానికి పరిమితం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): అతని పేరు మామిడి జీవరత్నం. 30 ఏళ్లుగా జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ స్టేడియంలో గ్రౌండ్ మార్కర్‌గా, స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. నేడు ఆరోగ్య సమస్యలతో మంచానికే పరిమితమయ్యాడు. సాయం చేసేవారి కోసం ఎదురు చూస్తున్నాడు.

జీవరత్నం 35 సంవత్సరాల క్రితం రూ.400ల జీతానికి ఉద్యోగంలో చేరాడు. వివిధ కారణాలతో పర్మినెంట్ కాలేదు. అయినా ఉదయం నుంచి సాయంత్రం వరకూ గ్రౌండ్‌లో సున్నపు లైన్లు వేస్తూ, చిమ్ముకుంటూ కష్టపడి పనిచేసేవాడు. 25 రోజుల క్రితం గ్రౌండ్‌లోనే పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తీసుకెళ్తే బ్రెయిన్ స్ట్రోక్ అన్నారు. ఒక్కసారిగా మాటలు పడిపోయాయి. పక్షవాతం వచ్చింది. జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ అధికారులు రూ.10 వేలను రుణంగా ఇచ్చి చేతులు దులుపుకొన్నారు. అందుబాటులో ఉన్న వైద్యం చేయించి అతడిని ఇంటికి తీసుకొచ్చారు. ప్రస్తుతం మంచానికే పరిమితమయ్యాడు.


జీవరత్నం

మంచంపైనే..

జీవరత్నం భార్య వజ్రమ్మ స్వీపర్‌గా, కుమారుడు ఫ్లెక్సీల దుకాణంలో పనిచేస్తున్నారు. కుమార్తెకు వివాహమైంది. ఆమె భర్త కూడా స్టేడియంలోనే పనిచేస్తాడు. అతడికి జీతం రావడం లేదు. పూట గడవడమే కష్టంగా మారింది. ఈ సమయంలో జీవరత్నం ఆరోగ్య సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నాడు. ఇన్నేళ్లు పనిచేసినా ఉద్యోగం పర్మినెంట్ కాకపోవడం, ఈఎస్‌ఐ, ఎల్‌ఐసీ తదితర బెనిఫిట్స్ లేకపోవడంతో వారి పరిస్థితి దారుణంగా ఉంది. సంవత్సరం నుంచి స్టేడియంకు వచ్చిన ప్రతిరోజూ సాటి ఉద్యోగులను జీతాలు ఎప్పుడొస్తాయి? అని అడిగి పనిచేసుకుని వెళ్లేవాడు. సిబ్బంది పరిస్థితిని రాష్ట్ర ప్రాధికార సంస్థకు తెలియజేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. పైపు ద్వారా అతడికి ఆహారం అందిస్తూ ఎలా కాపాడుకోవాలో అర్థం కాక కుటుంబం దిక్కుతోచని స్థితిలో ఉంది. వాకర్స్, అధికారులు, క్రీడాకారులు, దాతలు మానవత్వంతో స్పందించి సహాయం అందించాలని వేడుకుంటోంది.

సాయం చేసేందుకు..
కెనరా బ్యాంక్ అకౌంట్ నంబర్ : 34622200112565
ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ సీఎన్‌ఆర్‌బీ 0013462
ఫోన్ నంబర్ : 72868 09519

మహిళ అనుమానాస్పద మృతి

- తలపై గాయాలు
- పోలీసుల అదుపులో భర్త

పొదలకూరు: మండలంలోని తోడేరు రోడ్డు బస్‌షెల్టర్ వద్ద మహిళ అనుమానాస్పద స్థితిలో మృతిచెంది ఉండటాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. హత్యా? లేక ప్రమాదవశాత్తు ఏదైనా వాహనం ఢీకొని గాయపడి మృతిచెందిందా? అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. నక్కా తిరుపాలు, లక్ష్మమ్మ (52) ఏడేళ్లుగా తోడేరు రోడ్డు బస్ షెల్టర్‌ను స్థావరంగా చేసుకుని జీవిస్తున్నారు. వీరికి ఇద్దరు మగ పిల్లలు, ముగ్గురు ఆడపిల్లలున్నారు. మగపిల్లలు బుచ్చిరెడ్డిపాళెంలో ఉండగా, ఆడపిల్లలకు వివాహమైనట్లు తెలుస్తోంది. లక్ష్మమ్మ తలపై, శరీరంపై గాయాలై బస్‌షెల్టర్ వద్ద చనిపోయి ఉండటాన్ని స్థానికులు శుక్రవారం గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే పొదలకూరు సీఐ ఎ.శివరామకృష్ణారెడ్డి, ఎస్సై ఎస్‌కే హనీఫ్ ఘటనా స్థలానికి వెళ్లి ప్రాథమిక విచారణ నిర్వహించారు. అనుమానాస్పద మృతి కింద భర్తను అదుపులోకి తీసుకున్నారు. మెయిన్‌రోడ్డు పక్కనే బస్‌షెల్టర్ ఉండటంతో గురువారం అర్ధరాత్రి లక్ష్మమ్మ రోడ్డు మీదకు వెళ్లడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్రంగా గాయపడి మృతిచెందిందా? లేక ఇంకేమైనా కారణాలున్నాయా? అని ఆరాతీస్తున్నారు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.


లక్ష్మమ్మ మృతదేహం

నిమ్మ ధరలు (కిలో)

పెద్దవి : రూ.40
సన్నవి : రూ.20
పండ్లు : రూ.10

మద్దతు ధరపై రైతుల నిరాశ

నెల్లూరు(అర్బన్): వచ్చే ఖరీఫ్ సాగుకు సంబంధించి వరితోపాటు పలు పంటలకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఏపీ రైతు సంఘాల సమాఖ్య రాష్ట్రాధ్యక్షుడు చిరసాని కోటిరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గత సంవత్సరం కూడా కేంద్రం మద్దతు ధరను కంటి తుడుపుగా పెంచిందన్నారు. ప్రధానంగా వరికి క్వింటాకు రూ.69 మాత్రమే పెంచడం దారుణమన్నారు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని హామీలిచ్చి ఓట్లు వేయించుకున్న ప్రభుత్వం ఇలా చేయడం దారుణమన్నారు. వరి పంటకు ప్రతి సంవత్సరం 15 నుంచి 20 శాతం వరకు ఖర్చులు పెరుగుతున్నాయన్నారు. కూలీల కొరత ఉందన్నారు. జిల్లాలో ఎక్కువగా కౌలు రైతులున్నారన్నారు. భూ యజమానులకే గిట్టుబాటు లేదని దీంతో కౌలు రైతులు మరింత నష్టపోయి ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు.

అసంతృప్తుల మధ్య కౌన్సెలింగ్

నెల్లూరు(అర్బన్): ఉమ్మడి నెల్లూరు జిల్లా పరిధిలో హెల్త్ అసిస్టెంట్ల బదిలీ కౌన్సెలింగ్ తీవ్ర అసంతృప్తుల మధ్య జరిగింది. శుక్రవారం నెల్లూరులోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ సుజాత ఆధ్వర్యంలో ఈ ప్రక్రియను చేపట్టారు. మూడు రోజుల క్రితం కౌన్సెలింగ్ జరిగే సమయంలో ఆరోపణలు రాగా హెల్త్ అసిస్టెంట్లు వాయిదా వేయించారు. అయితే అప్పటికీ, ఇప్పటికీ కౌన్సిలింగ్ తీరును మార్చేశారు. ప్రస్తుతం తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న (గతంలో నెల్లూరు జిల్లా ప్రాంతాలు) సూళ్లూరుపేట, నాయుడుపేట, వెంకటగిరి, గూడూరు ప్రాంతాల హెల్త్ అసిస్టెంట్లను ఆయా ప్రాంతాల సమీపంలోకి బదిలీ చేశారు. పునర్విభజన తర్వాత ఉన్న నెల్లూరు జిల్లాకు సంబంధించిన వారిని ఈ జిల్లా వరకు మాత్రమే బదిలీ చేసి సర్దుబాటు చేశారు. తిరుపతి జిల్లా పరిధిలో రీ డిప్లాయ్‌మెంట్ కింద 57 మంది బదిలీలు జరిగాయి. ఈ జిల్లాకు చెందిన 171 మంది బదిలీల ప్రక్రియ రాత్రి పొద్దుపోయే వరకు జరిగింది. కార్యక్రమంలో జిల్లా మలేరియా నివారణ అధికారి హుస్సేనమ్మ, సహాయ మలేరియా నివారణాధికారి నాగార్జునరావు తదితరులు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీఎంహెచ్‌ఓ

అందుకే అనుమానాలు

కాగా కౌన్సెలింగ్ ప్రక్రియలో నేరుగా యూనియన్ నాయకులు పాల్గొనకూడదు. ఎవరికైనా అన్యాయం జరిగితేనే అధికారులను ప్రశ్నించాలి. అయితే ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (ఏపీజీఈఏ) జిల్లా అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి నేరుగా కౌన్సెలింగ్‌లో పాల్గొన్నాడు. ఆయనే మైక్ తీసుకుని పేర్లను పిలవసాగాడు. అక్కడ ఖాళీ ఉంది.. ఇక్కడ ఖాళీ ఉంది.. కోరుకో అని చెప్పసాగాడు. దీంతో పలువురు హెల్త్ అసిస్టెంట్లు తమకు అన్యాయం జరుగుతోందని చర్చించుకున్నారు.

ఇరువర్గాల ఘర్షణలో పలువురికి గాయాలు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు పట్టణంలోని బైపాస్‌రోడ్డు వద్ద శుక్రవారం మధ్యాహ్నం వినాయక బొమ్మల తయారీదారులు, పందుల పెంపకందారులకు మధ్య జరిగిన ఘర్షణలో పలువురికి గాయాలయ్యాయి. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాజస్థాన్‌కు చెందిన కొందరు వెంకటేశ్వర స్వామి దేవాలయం సమీపంలోని బైపాస్‌రోడ్డు వద్ద స్థలం లీజుకు తీసుకుని వినాయక బొమ్మలు తయారు చేస్తున్నారు. ఆ స్థలానికి సమీపంలో లారీ కాటా వద్ద కొందరు తమ పందులను లారీలోకి ఎక్కించే నిమిత్తం నిలబడి ఉన్నారు. ఈ క్రమంలో రాజస్థాన్ వారికి చెందిన మూడు చక్రాల ఆటో పందుల పెంపకందారుల సమీపంలో వెళ్లడంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. పందుల పెంపకం వారు మద్యం తాగి రాజస్థానీయులు ఎంత వారించినా వినకుండా ఘర్షణకు దిగి చేయి చేసుకున్నారు. దీంతో వారు తిరగబడ్డారు. పందుల పెంపకందారులు కర్రలతో రాజస్థానీయులపై దాడి చేశారు. రమేష్, సురేష్ అనే వారికి తలపై తీవ్ర గాయాలయ్యాయి. మరో నలుగురు స్వల్పంగా గాయపడ్డారు. సామాజిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి చికిత్స పొందారు. విషయం తెలుసుకున్న ఏఎస్సై జయరాజు వైద్యశాలకు చేరుకుని బాధితుల నుంచి వివరాలు సేకరించారు. వింజమూరు ప్రభుత్వ వైద్యశాల పక్కనే ఉన్న పందుల పెంపకందారులు గతంలో కూడా పట్టణంలో పలువురిపై ఇదే తరహాలో ఘర్షణకు దిగినట్లుగా స్థానికులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా రాజస్థానీయులు వారిపై ఫిర్యాదు చేసేందుకు భయపడుతున్నట్లు తెలిసింది.

కారుణ్య నియామకాల ఉత్తర్వుల అందజేత

నెల్లూరు(అర్బన్): ఇద్దరు ఉద్యోగులు మృతిచెందగా రెండు కుటుంబాలకు చెందిన ఇద్దరికి కారుణ్య నియామకం కింద ఉద్యోగం కల్పిస్తూ ఇన్‌చార్జి కలెక్టర్ కార్తీక్ ఉత్తర్వులిచ్చారు. స్పెషల్ సర్వేయర్ పి.శేషయ్య చనిపోగా ఆయన కుమార్తె యశస్వినికి రెవెన్యూ విభాగంలో జూనియర్ అసిస్టెంట్‌గా అవకాశం కల్పించారు. పోలీస్ కానిస్టేబుల్‌గా పనిచేస్తూ ఎ.మహేష్ మృతిచెందగా ఆయన భార్య విజయను సంక్షేమ శాఖలో వాచ్‌ఉమెన్‌గా నియమించారు. అపాయింట్‌మెంట్ లెటర్లను డీఆర్వో ఉదయభాస్కర్‌రావు, కలెక్టరేట్ పరిపాలనాధికారి విజయకుమార్‌లు శుక్రవారం కలెక్టరేట్‌లో వారికి అందజేశారు.


నియామకపత్రం అందుకుంటున్న దృశ్యం

మార్కులు కలిపారు

- ట్యాంపరింగ్ జరిగినట్లు నిర్ధారణ
- పరీక్ష కేంద్రంగా ఉన్న కళాశాలపై విచారణకు కమిటీ
- సీఓఈ వీవీ సుబ్బారావు వెల్లడి
- కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్

కందుకూరు రూరల్: విద్యార్థుల పోరాటం ఎట్టకేలకు ఫలించింది. కందుకూరులోని ఓవీ రోడ్డులోని గాయత్రి జూనియర్ కళాశాలకు చెందిన ఎం.అవినాష్‌బాబు, టి.సాయి తేజస్వినిల సీనియర్ ఇంటర్ ఇంగ్లిష్ జవాబుపత్రాలు ట్యాంపరింగ్‌కు గురైన సంగతి తెలిసిందే. త్రిసభ్య కమిటీ వేసిన బోర్డు అధికారులు ట్యాంపరింగ్ జరిగినట్లు నిర్ధారించి విద్యార్థులకు మార్కులు కలిపినట్లు సీఓఈ వీవీ సుబ్బారావు శుక్రవారం తెలిపారు. ఇంగ్లిష్ సబ్జెక్ట్‌లో ఎం.అవినాష్‌బాబుకు 4 మార్కులు (80 నుంచి 84కు), టి.సాయి తేజస్వినికి 5 మార్కులు (88 నుంచి 93) కలిపి మార్కులిస్టులను పంపించామని తెలిపారు. వారు పరీక్ష రాసిన కేంద్రం వివేకా జూనియర్ కళాశాలపై విచారణకు కమిటీ వేశామన్నారు. కాగా మూడు, నాలుగు ఏళ్లుగా ఇలాగే మొదటి సంవత్సరంలో వచ్చిన మార్కులు, రెండో సంవత్సరంలో రావడం లేదు. అది కూడా ఆ కళాశాలలోనే పరీక్ష రాసిన వారికే మార్కులు తగ్గుతున్నాయి.

పాపం విద్యార్థులు

విద్యార్థులు ఎంతో కష్టపడి చదివి పరీక్షలు రాస్తారు. వారి జవాబుపత్రాలు ట్యాంపరింగ్ చేయడం దారుణం. ఓపెన్ టెన్త్‌లో మాస్ కాపీయింగ్ జరిగితేనే ఇన్విజిలేటర్‌ను సస్పెండ్ చేశారు. అలాంటిది తెలివైన టాపర్ విద్యార్థుల భవిష్యత్‌ను దెబ్బతీసేందుకు ట్యాంపరింగ్ చేయడం పెద్ద నేరం. దీనిపై బోర్డు అధికారులు సమగ్ర విచారణ జరిపి చర్యలు తప్పకుండా తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అవినాష్‌బాబుకు తల్లిదండ్రులు లేరు. సాయితేజస్విని తల్లిదండ్రులు చెక్కబండిపై పండ్లు విక్రయిస్తుంటారు. కనీసం రీవాల్యుయేషన్‌కు డబ్బులు కట్టలేని పరిస్థితి వారిది.

బోర్డు అధికారులకు ధన్యవాదాలు

మార్కులపై అనుమానం వచ్చి బోర్డు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ప్రత్యేక అనుమతులతో నా పేపర్‌ను పరిశీలించారు. ట్యాంపరింగ్ జరిగినట్లు నిర్ధారించి 5 మార్కులు కలిపి మార్క్‌లిస్ట్ పంపించారు. బోర్డు కమిషనర్‌కు, సీఓఈకు ధన్యవాదాలు. అయితే కేవలం ట్యాంపరింగ్ చేస్తూ దిద్దిన ఐదు జవాబులకు మార్కులు కలిపారు. ట్యాంపరింగ్ జరిగింది గ్రామర్ పార్ట్‌లో. సులభంగా ఉండే గ్రామర్ పార్ట్‌లో దిద్దడంతో దాని ప్రభావం థియరీ పార్ట్ ప్రశ్నలపై పడి మార్కులు తగ్గాయి. అదే జరగకపోతే దాదాపుగా 97 మార్కుల వచ్చేవి. ఐదు మార్కులు పోగొట్టావని ఇన్విజిలేటర్ నాతో అన్నప్పటికీ ఇలా జరుగుతుందని అర్థం చేసుకోలేకపోయాను.

– టి.సాయితేజస్విని, విద్యార్థిని

సంతోషంగా ఉంది

ఇంగ్లిష్ సబ్జెక్ట్ జవాబుపత్రంలో ట్యాంపరింగ్ జరిగినట్లు నిర్ధారించి నాకు నాలుగు మార్కులు కలిపారు. గ్రామర్ పార్ట్‌లో మార్కులు తగ్గడంతో ఆ ప్రభావం థియరీ పార్ట్‌పై పడి మార్కులు తగ్గాయి. దీంతో నష్టం జరిగింది. నాలుగు మార్కులు కలపడం సంతోషంగా ఉంది. కారకులైన వారిపై చర్యలు తీసుకోవాలి. నాలాంటి విద్యార్థులు ఎంతోమందికి నష్టం జరిగి ఉండొచ్చు. గతేడాది కూడా మా కళాశాల టాపర్లకు మార్కులు తగ్గాయి. బోర్డు అధికారులు విచారణ చేయాలి.

– ఎం.అవినాష్‌బాబు, విద్యార్థి